ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబరు 2025
5
శ్రీకాకుళం

సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలు వాయిదా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

తుపాను ప్రభావంతో జిల్లాలో ఈనెల 30వ తేదీన నిర్వహించాల్సిన జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఎంపికల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న అర్హులైన జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ప్రోత్సాహకాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు http://sports.ap.gov.in వెబ్‌సైట్‌లో నవంబరు నాలుగో తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. శాప్ క్రీడా యాప్‌లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ముంచిన 'మొంథా'

- తుపాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న బాహుదా
- పొంగిన వాగులు, వంకలు
- పలు గ్రామాలు జల దిగ్బంధం
- గాలుల తీవ్రతకు నేలకొరిగిన వరిపంట, చెట్లు
- నాలుగు పూరిళ్ల గోడలు నేలమట్టం

కోతకు గురైన పి.జి పేట తీరం

శ్రీకాకుళం రూరల్ మండలంలోని పి.జి పేట సముద్రతీరం కోతకు గురైంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎమ్మెల్యే గొండు శంకర్ కోతకు గురైన తీరాన్ని పరిశీలించారు. తుపాను ప్రభావంతో అలల తాకిడి మరింత తీవ్రంగా మారాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ గణపతిరావు, ఎంపిడిఒ ప్రకాశరావు, డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణ తదితరులున్నారు.

పలాస : నేలకొరిగిన నీట మునిగిన వరిచేను

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, విలేకరుల యంత్రాంగం

మొంథా తుపాను ప్రభావంతో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పొలాల్లోకి నీరు చేరడంతో వరి పంట నీట మునిగింది. గాలుల తీవ్రతకు పలుచోట్ల పంట నేలకొరిగింది. ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు బాహుదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సముద్రం అల్లకల్లోలంగా మారింది. శ్రీకాకుళం మండలం పెద్దగణగల్లపేట వద్ద సముద్రం కోతకు గురైంది. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. మెళియాపుట్టి, కవిటిలో మూడు పూరిళ్లు నేలమట్టమయ్యాయి. తుపాను నేపథ్యంలో జిల్లా మీదుగా వెళ్లే ఆరు రైళ్లను అధికారులు రద్దు చేశారు. తుపాను పరిస్థితిపై ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బాహుదా

ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో వంశధారలో స్వల్పంగా వరద ప్రవాహం పెరుగుతోంది. హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద వంశధారలో ఇన్‌ఫ్లో 14,500 క్యూసెక్కులు కాగా, 17,166 క్యూసెక్కుల నీటిని కిందికి విడిచిపెడుతున్నారు. బాహుదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇన్‌ఫ్లో 34 వేల క్యూసెక్కులుగా నమోదైంది. బాహుదా నదిలో నీటి ప్రవాహం 51,228 క్యూసెక్కులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బగలటి డ్యామ్ గేట్లు ఎత్తి వేయడంతో వరద నీరు వచ్చింది. దీంతో పలు గ్రామాలు జల దిగ్బంధమయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. నాగావళి నదికి సాధారణ ప్రవాహమే కొనసాగుతోంది. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పలాస మండలం కంబిరిగాం వంతెనపై నుంచి మూడు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహించడంతో కంబిరిగాం, కేదారిపురం, ఈదురాపల్లి, గంగువాడ, చినంచల, పెదంచల, గోదావరిపురం, వీరరామచంద్రపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బ్రాహ్మణతర్లా వద్ద వరహాల గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్‌లో వరదనీరు వచ్చి చేరడంతో గరుడఖండి, పాత జగదేవుపురం, జగదేవుపురం, లక్ష్మీపురం గ్రామాల ప్రజలు రాకపోకలు చేసేందుకు వీలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమలకుడియా గెడ్డ ఉదతంగా ప్రవహించడంతో పూర్ణభద్ర, అమలకుడియా, అమలకుడియా కాలనీ లోపలికి వరద నీరు వచ్చింది. పలాస మండలం సున్నాడ, రాజగోపురం రోడ్లు వరద నీటి ఉధతికి రోడ్లు కోతకు గురయ్యాయి. సోంపేట మండలం మాల గోవిందపురం పంచాయతీ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బాతుపురం గ్రామానికి వెళ్లే కాజ్ వేపై ప్రమాదకర స్థితిలో పూర్తిగా వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఇచ్ఛాపురం మండలం డొంకూరులో సముద్రపు అలల ఉధృతి తీవ్రంగా ఉండడం, భారీ వర్షాలతో స్థానిక మత్స్యకారులను పునరావాస కేంద్రానికి తరలించారు.

సోంపేట : నేలకొరిగిన చెట్టు

ఇచ్ఛాపురం : బాహుదా నది లో భారీగా పెరిగిన వరద నీరు

నేలకొరిగిన వరిపంట, చెట్లు

నందిగాం, కోటబొమ్మాళి, లావేరు తదితర మండలాల్లో వరి పంట నేలకొరిగింది. లావేరు మండలంలోని లావేటిపాలెం, కేశవరాయపురం, తాళ్లవలస, బొడ్డపాడు, సుభద్రాపురం, గోవిందపురం తదితర గ్రామాల్లో రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న పంట తడిచిపోయింది. టెక్కలిలో అగ్నిమాపక కేంద్ర సమీపంలో పురాతన చెట్టు నేలకొరిగింది. సోంపేట మండలంలోని కొర్లాం ఫ్లైఓవర్ పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో చెట్టు కూలడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. చెట్టును తొలగించడంతో ట్రాఫిక్ పునరుద్ధరించారు. కవిటి మండలం డి.జి పుట్టుగలో నేలకొరిగిన తాటిచెట్టును తొలగించిన సిబ్బంది గాలికి వాలిన కరెంట్ స్తంభాలను సరిచేశారు.

వర్షపాతం వివరాలు

కవిటి	రాజపురం	47.75
మెళియాపుటి	మెళియాపుట్టి	46.5
శ్రీకాకుళం	శ్రీకాకుళం	43.75
పలాస	పలాస	42
కంచిలి	ఎంఎస్‌పల్లి	42
ఆమదాలవలస	మెట్టక్కివలస	41.5
ఎల్ఎన్‌పేట	ఎల్ఎన్‌పేట	35.25
సోంపేట	కొర్లాం	34.5
హిరమండలం	హిరమండలం	34.5
ఇచ్ఛాపురం	ఇచ్ఛాపురం	33
కోటబొమ్మాళి	నిమ్మాడ	32
నందిగాం	నందిగాం	29
మందస	మందస	26.25
లావేరు	లావేరు	23
రణస్థలం	పైడిభీమవరం	22.75
సారవకోట	సారవకోట	22
పోలాకి	పోలాకి	20
టెక్కలి	రావివలస	17.25
గార	బూరవల్లి	3.0

ఇన్‌ఛార్జి కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన

మొంథా తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ప్రజలను కోరారు. ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి గార మండలం బందరువానిపేట మొగదలపాడు, తదితర సముద్ర తీర ప్రాంత గ్రామాలను సందర్శించారు. తీర ప్రాంతానికి దగ్గరలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదన్నారు. శిధిల గృహాల్లో నివాసం ఉండరాదన్నారు. బందరువాని పేట, మొగదలపాడులో పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అన్ని మందులు ఉన్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహశీల్దార్ చక్రవర్తి, ఎంపిడిఒ, సిఐ పాపినాయుడు, ఎస్ఐ, తదితరులున్నారు.

గ్రామాల్లో పోలీసులు సందర్శన

జిల్లాలో భారీ వర్షాలతో మందస, బారువ ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను పోలీసులు తొలగించారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శన చేసి గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు. తుపాను తీరం దాటే సమయంలో అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందన ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లొద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు గానీ సమీప పోలీస్‌స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలన్నారు.

పలు రైళ్ల రద్దు

తుపాను ప్రభావంతో జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దయ్యాయి. బరంపూర్ - విశాఖపట్నం పాసింజర్, భువనేశ్వర్- బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్- సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్, పలాస-విశాఖపట్నం ఇఎంయు పాసింజర్, గుణుపూర్-విశాఖపట్నం పాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మీదుగా నడిచే రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికుల్లేక రైల్వేస్టేషన్లు బోసిపోయాయి.

కవిటి : జగతిలో నేలకూలిన మట్టి గోడ

పూరిళ్ల గోడలు నేలమట్టం

కవిటి మండలంలోని జగతి, కపాసుకుద్ది గ్రామాల్లో రెండు పూరిళ్లలో మట్టి గోడలు నేలమట్టమయ్యాయి. జగతి గ్రామంలో మట్టి ఇంట్లో నివాసముంటున్న పులకల మల్లేశ్వరరావును అర గంట ముందే సురక్షిత ప్రదేశంలోకి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కపాసుకుద్దిలో ఆర్తికట్ల కనకయ్యకు చెందిన మట్టి గోడ వర్షాలకు కూలింది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మెళియాపుట్టి మండలం భరణికోట పంచాయతీ పరిధిలోని కాటం వీధిలో సవర సురేష్ ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటకు రావడంతో ప్రాణ నష్టం తప్పింది. పొందూరు మండలం కొంచాడలో సూర్యనారాయణకు చెందిన పూరింటి మట్టి గోడ కూలిపోయింది. అదే మండలంలోని లోలుగులో పైడిరాజుకు చెందిన పూరిల్లు గోడ వర్షాలకు నేలమట్టమైంది.

అరసవల్లి : జలమయమైన శ్రీకాకుళం రైతుబజారు

రెండు గొర్రెలు మృతి

పలాస మండలం బొడ్డపాడుకు చెందిన కిక్కర అప్పలస్వామికి చెందిన రెండు గొర్రెలు చలికి తట్టుకోలేక మతి చెందాయి. సుమారు రూ.30 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఇచ్ఛాపురం : తడిసిన ఎండు చేపలు

రూ.15 లక్షల మత్స్య సంపద నష్టం

ఇచ్ఛాపురం మండలం డొంకూరులో ఇసుక దిబ్బలపై ఎండబెట్టిన సుమారు రూ.15 లక్షల విలువైన 30 టన్నులకు పైగా ఎండుచేపలు వర్షాలకు తడిచిపోవడంతో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. నష్టపోయిన మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వరరావు

ఉద్యోగ సర్వీసులో అవినీతి వద్దు

జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఉద్యోగ సర్వీసులో ఎలాంటి పొరపాట్లు చేయరాదని, అవినీతికి ఆస్కారమీయొద్దని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఈనెల 27 నుంచి నవంబరు రెండో తేదీ వరకు నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి లంచాలకు తావు లేకుండా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాలన్నారు. అవినీతి నిరోధకశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి రమణ, కె.భాస్కరరావు మాట్లాడుతూ ప్రభుత్వం, అవినీతి నిరోధక శాఖ ఆదేశాల మేరకు విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగుల్లో అవినీతిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ సర్వీసులో ఎలాంటి లంచాలకు అలవాటు పడకుండా ఉండాలన్నారు. అవినీతి వల్ల సర్వీసులో ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఉద్యోగులతో డిఆర్ఒ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ సూర్యనారాయణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ కోర్సుల దరఖాస్తుల గడువు పెంపు

శ్రీకాకుళం : 2025-26 విద్యా సంవత్సరానికి గానూ కన్వీనర్ కోటాలో బిఎస్‌సి ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ కోర్సుల దరఖాస్తుల గడువును నవంబరు రెండో తేదీ వరకు ఎన్‌టిఆర్ వైద్యారోగ్య విశ్వవిద్యాలయం పెంచిందని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని బైపిసి విద్యార్థులకు ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు. రాగోలులోని జెమ్స్ ఆవరణలో గల బొల్లినేని బిఎస్‌సి ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ కళాశాలలో ఈ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7680945357, 9121999654 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రోగులను ఎందుకు రిఫర్ చేస్తున్నారు?

- జిల్లా ప్రత్యేకాధికారి కె.వి.ఎన్ చక్రధర్‌బాబు
- కిడ్నీ పరిశోధన కేంద్రం, ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పలాస

కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు సమకూర్చినా రోగులను ఇతర ఆస్పత్రులకు ఎందుకు రిఫర్ చేస్తున్నారని జిల్లా ప్రత్యేకాధికారి కె.వి.ఎన్ చక్రధర్ బాబు వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. తుపాను పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చిన ఆయన కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు గంటల పాటు అన్ని విభాగాలను పరిశీలించారు. పలు పరీక్షలను ప్రైవేటు క్లినిక్‌ల్లో చేయిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, ఇది సరికాదన్నారు. ఆస్పత్రిలో ప్రయోగాలకు రసాయనాలు నిండుకున్నాయని, దీని కారణంగా రోగులకు బయట పరీక్షలు చేయించాల్సి వస్తోందని వైద్యులు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ తగినంత నిధులు ఆస్పత్రికి ఉన్నప్పుడు సొంతంగా కొనుగోలు చేసుకోవాల్సి ఉన్నా, ఆ విధంగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇకపై అలాగే చేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ జె.కిషోర్ బదులిచ్చారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గిపోతుందని, రోజుకు పది మంది కూడా రావడం లేదంటే ఇక్కడ సేవలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని చక్రధర్ బాబు అన్నారు. ఆస్పత్రిలో సమస్యలు, మందుల కొరత ఇతర అంశాలు ఏవైనా ఉంటే తనకు నివేదిక ఇవ్వాలని, దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త కళ్యాణ్‌బాబు, ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాస్, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, పశుసంవర్ధకశాఖ ఎడి మట్ట రవికష్ణ, ఎంపిడిఒ వసంత కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ పరిశోధనా కేంద్రం వైద్యులతో చర్చిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్ బాబు

డిపోలకు రేషన్ పంపించలేదా...?

నెల పూర్తి కావస్తున్నా రేషన్ సరుకులను డిపోలకు ఎందుకు పంపించలేదని జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్ బాబు ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస ఎంఎల్ఎస్ పాయింట్, పలాస రేషన్ డిపోను తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉన్న సరుకు, రికార్డులో ఉన్న సరుకుకు తేడా ఉందా అని పరిశీలించారు. తుపాను కారణంగా ప్రతి డిపోకు అదనంగా 20 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ జి.వెంకటేష్, ఎంఎల్ఎస్ పాయింట్ డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంలు భద్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం)లు భద్రంగా ఉండాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఉన్న ఇవిఎం గొడౌన్‌ను మంగళవారం పరిశీలించారు. గోదాం పరిస్థితి, ఉన్న ఇవిఎంలు సిబ్బంది వివరించారు. తుపాను వల్ల వర్షాలకు ఇవిఎం గోదాములో నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు చేరడం వల్ల పాడయ్యే అవకాశం ఉంటుందన్నారు. బ్యాటరీలు, ఇవిఎంల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు చేరే పరిస్థితి ఉంటే వేరే చోటుకు మార్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశీలనలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఇవిఎం గోదామును పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

బహిరంగ వేలం ప్రకటన
మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) శ్రీకాకుళం వారి కోర్టులో

Between:
గురుగుబిల్లి రామారావు ....డిగ్రీ హోల్డర్/వాది
And:
పొన్నాడ పూర్ణచంద్రరావు
......జడ్జిమెంట్ డెట్టర్/ ప్రతివాది

పై నెంబర్ అమలు పిటిషన్ డిగ్రీ హోల్డర్‌కు రావలసిన అమలు మొత్తం పైకం వగైరాలు రాబట్టుకొనే నిమిత్తం ప్రతివాది/జడ్జిమెంట్ డెట్టర్ తాలూకా ఈ దిగువ షెడ్యూల్ దాఖల స్థిరాస్తి వేలం వేయుట మూలంగా రాబెట్టమని కోరుచూ పై అమలు దాఖలు చేసి ఉన్నారు. సదరు అమలు పిటిషన్‌లో శ్రీ కోర్టు వారు జడ్జిమెంట్ తాలూకా దిగువ షెడ్యూల్ ఆస్తిని **తేదీ 20-11-2025 ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు** పై కోర్టులో వేలం జరుపుటకు నిర్ణయించియున్నారు. కావున సదరు బహిరంగ వేలంలో **పాల్గొనదలచినవారు పైకోర్టు వారు ఎదుట తేదీ 20-11-2025 ఉదయం 10:30 ని॥లకు** హాజరై వేలం పాడుకొనవచ్చును వేలం షరతులు గూర్చి డిగ్రీ హోల్డర్ తరుపు న్యాయవాది వద్ద గాని లేదా పైకోర్టు సూపరిండెంట్ వారిని గానీ అడిగి తెలుసుకోవలెను.

వేలం వేయుటకు ఆస్తి షెడ్యూల్ వివరములు: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్ డివిజన్, ఎచ్చెర్ల మండలం, బమ్మిడివానిపేట గ్రామం, H/o దోమాం పంచాయతీ, SM పురం పేట రెవిన్యూ గ్రామం, S.No: 24-9, హౌస్ ఎసైన్మెంట్ No:14, Extent 1394.64 Square yards Slabbed House.
ఇంటికి గల హద్దులు:-
తూర్పు: సనపల శిమ్మయ్య ఖాళీ స్థలం
దక్షిణ: పంచాయతీ సి.సి రోడ్డు
పడమర: పైడి కృష్ణారావు ఖాళీ స్థలం
ఉత్తర: తమ్మినేని పావని స్థలం
వారెంట్ మొత్తం: **15,70,020/-**
డిగ్రీ హోల్డర్ విలువ: **20,00000/-**
ఆమీన్ విలువ: **22,00000/-**
జడ్జిమెంట్ డిటర్ విలువ: **NIL**
NB: మహారాజశ్రీ పొందూరు సబ్ రిజిస్ట్రార్ వారు జారీ చేసిన EC ప్రకారం తేదీ 01-01-1996 నుండి 01-9-2025. వరకు ఎట్టి తనఖా వగైరాలు సదర ఆస్తిపై లేవు.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //
పంచిరెడ్డి ఈశ్వరరావు
న్యాయవాది,
శ్రీకాకుళం, ఫోన్: 9949502216.

అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న చక్రధర్‌బాబు, ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రెండు రోజుల్లో 37 ప్రసవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో 37 మంది గర్భిణులు ప్రసవించినట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి కళ్యాణ్‌బాబు మంగళవారం వెల్లడించారు. మొంథా తుపాను సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న గర్భిణులను వివిధ ఆస్పత్రులకు తరలించామన్నారు. ఎటువంటి సమస్యలు లేకుండా వైద్య సేవలు అందించడంతో బిడ్డలకు జన్మనిచ్చారని తెలిపారు. వివిధ ప్రభుత్వాస్పత్రుల్లో సోమవారం 13, మంగళవారం 24 ప్రసవాలు జరిగినట్లు పేర్కొన్నారు. ఇందులో సోమవారం టెక్కలిలో ఆరు, ఇచ్ఛాపురంలో మూడు, సోంపేటలో రెండు, నరసన్నపేటలో ఒకటి, రణస్థలం ఒకటి, మంగళవారం టెక్కలిలో ఆరు, ఇచ్ఛాపురంలో మూడు, నరసన్నపేటలో ఎనిమిది, పాతపట్నంలో మూడు, రణస్థలంలో రెండు, ఆమదాలవలసలో ఒకటి, హరిపురంలో ఒకటి, పొందూరులో ఒకటి ప్రసవాలు జరిగాయన్నారు. కోటబొమ్మాళి సిహెచ్‌సిలో గుండె పోటుతో వచ్చిన మహిళకు సుమారు రూ.40 వేల విలువ గల ఇంజెక్షన్ వేసి తదుపరి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. ప్రత్యేక అధికారి చక్రధర్‌బాబు, ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అత్యవసర వైద్య సేవలపై సమీక్షిస్తున్నామని తెలిపారు.

గర్భిణితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ అనిత

గర్భిణులు అప్రమత్తం

పోలాకి: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉంటున్న గర్భిణులు, బాలింతలను సురక్షితమైన ప్రాంతాలకు తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కె.అనిత ఆదేశించారు. మండలంలోని రాజారాంపురాన్ని మంగళవారం సందర్శించి గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో 78 గ్రామాలను తుపాను ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామన్నారు. అందులో 152 మంది గర్భిణులు ఉన్నారని అన్నారు. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రత్యేక వైద్యుల సంరక్షణలో ఉండేటట్టు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడి నీరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనాథ్, విస్తరణాధికారి రవికుమార్, శేఖర్‌బాబు, శ్రావణి, ఆరోగ్య రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఆమదాలవలస : మండలంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.660.33 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వంద అభివృద్ధి పనులకు ఈ నిధులు ఉపాధి హామీ కింద కలెక్టర్ ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఈ నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు, ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

'మొంథా' నష్టం... పరిశీలన

రైల్వే అండర్ టన్నెల్ మూసివేత

ఆమదాలవలస : మొంథా తుపాను ప్రభావంతో రైల్వే శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా రైల్వే ట్రాక్‌ను ఆనుకొని ఉన్న కనుగులవలస అండర్ టన్నెల్ మూసివేశారు. కొద్దిపాటి వర్షాలకే గతంలో ఈ అండర్ టన్నెల్ నీటితో నిండి రాకపోకలు నిలిచిపోవడం జరిగేవి. ప్రస్తుతం ఏర్పడిన తుపానుతో అండర్ టన్నెల్ లో భారీ స్థాయిలో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నట్లు గుర్తించిన రైల్వే అధికారులు మూసివేశారు. అండర్ టన్నెల్ రెండు వైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ అండర్ టన్నెల్ రైల్వే అధికారులు మూసివేయడంతో ఆమదాలవలస పట్టణం నుంచి తమ్మయ్యపేట, ముద్దాడపేట, కలివరం, తొగరాం గ్రామాలకు రాకపోకలు కష్టతరంగా మారాయి. మండలంలోని కొర్లకోట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.



అండర్ టన్నెల్‌లో నిలిచిన వర్షపునీరు

మొంథా తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సీపాన కాంతారావు అన్నారు. మండలంలోని వంశధార పరివాహక ప్రాంత గ్రామమైన చవ్వాకులపేటలో తుపాను సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మొంథా తుపాను ప్రభావ తీర ప్రాంతాల పర్యటనలో భాగంగా మండలంలోని డి.మత్స్యలేశం సముద్ర తీర ప్రాంతాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడి తుపాను ప్రభావాన్ని అడిగి తెలుసుకున్నారు. డి.కె.పాలెం వద్ద ఉన్న తుపాను షెల్టర్ భవనాన్ని పరిశీలించి నిర్వాసితులతో మాట్లాడారు. తుపాన్ షెల్టర్ బిల్డింగ్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ... అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూలిపోయే పరిస్థితి చూసి అధికారుల నిర్లక్ష్యంపై విస్తూపోయారు. వెంటనే వీడియో తీసి జిల్లా విద్యుత్ శాఖ అధికారులకు పంపించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బెండు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మొంథా తుపాను ప్రభావ తీర ప్రాంతాలలైన కొత్త ముక్కాం, జీరుపాలెం, అల్లివలస, కొవ్వాడ, ఎన్.జి.ఆర్.పురం, కొమరవానిపేట తదితర గ్రామాలను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడి తుపాను ప్రభావాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు డిపిఒ కె. భారతి సౌజన్య, ఇన్‌చార్జి ఆర్‌డిఒ కె.లక్ష్మణమూర్తి, తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఆర్ఐ ఎం.సతీష్, సిఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి, కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీనాయుడు, ఎంపిటిసి బస్వ గోవిందరెడ్డి, కరాటే లక్షణ్, దుమ్ము అశోక్, ఎం.పోలీసు, రాముడు పాల్గొన్నారు.

ఎచ్చెర : పర్యటిస్తున్న ఎంపీ, అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఈశ్వరరావు

దాసరి రాజు సందర్శన

కవిటి: తీర ప్రాంతం కపాసుకుద్ది గ్రామాన్ని ఇచ్ఛాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ దాసరి రాజు సందర్శించారు. గ్రామంలో తాత్కాలిక సౌకర్యాల లోపం ఉన్నట్లు గుర్తించి, వెంటనే సంబంధిత అధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ, తహశీల్దార్ స్పందించి తుపాను తీరం దాటే సమయంలో గాలులు, వర్షాలు తీవ్రంగా ఉండే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు దాసరి రాజుకు వివరించారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ బడే దేవరాజు, జనసేన నాయకులు యర్ర మధు, శేఖర్, దాసు, బడే మధు, శివ పాల్గొన్నారు.

పొందూరు : జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

సంతబొమ్మాళి : తుపాను ప్రభావంతో భావనపాడులో మెరైన్ పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ శాఖ సంయుక్త ఆధ్వర్యాన మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో చేపట్టే సహాయక చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెరైన్ సిఐ రాము, ఎస్ఐలు శ్రీనివాస్, మన్మథరావు, కార్యదర్శి రాజు, విఆర్ఒ ఉమాపతి పాల్గొన్నారు.

కంచిలి : మొంథా తుపాను కారనంగా మండలంలోని బెల్లుపడ, పోలేరు, డిజిపురం, బైరీపురం గ్రామాల్లో రోడ్లపై వర్షపునీరు చేరడంతో ఆంధ్రా, సరిహద్దు ఒడిశా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణ బట్టి వద్ద ఉన్న గోవింద సాగరం నుంచి వరద నీరు రహదారిపైకి చేరింది. తహశీల్దార్ రమేష్ కుమార్, రెవెన్యూ సిబ్బందితో కలిసి గంగాసాగరం రిజర్వాయరును పరిశీలించారు. నువ్వగడకు చెందిన గొమాంగో సీతారాం అనే వ్యక్తి ఒంటరిగా పూరి పాకలో ఉండటం గమనించి, అతడిని నువ్వగడ ఆశ్రమ పాఠశాలలో వసతి కల్పించారు. రాకసిగెడ్డ వద్ద నీరు ఉధృతంగా ప్రవహించడంతో కర్తలి, సిర్తలి, ఎం.ఎస్.పల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.

తీరా ప్రాంతాలకే పరిమితం?

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని గ్రామాల్లో ఉన్న సముద్ర తీరా ప్రాంతాలకే పరిమితం అవుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో ప్రజలకు పట్టించుకోవడం లేదు. ఎక్కడ చూసినా రోడ్లపైన వర్షపు నీరు నిల్వలు దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీ మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే చేతికి వచ్చిన మొక్కజొన్నపంట తడిచిపోవడంతో రైతు ఆందోళన చెందుతున్నారు.

పలాస : ఉధృతంగా ప్రవహిస్తున్న కుంబిరిగాం వరహాలగెడ్డ

సోంపేట : మండలంలోని ఎర్రముక్కం, బట్టిగల్లూరు, డొంకలూరు, నడుమూరు, ఎక్కువూరు గ్రామాల్లో టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నాయుడు, మాజీ జెడ్‌పిటిసి సూరాడ చంద్రమోహన్ పర్యటించారు. కార్యక్రమంలో మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షులు బడే తమ్మయ్య, సర్పంచ్ వాసుపల్లి కృష్ణారావు, ఎంపిటిసి వంక రామారావు, మాగుపల్లి పాపారావు, బడే జానకిరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రామదాసుపురంలో చెరువుగట్టుకు కంత పడడంతో ఎంపిడిఒ వాసుదేవరావు, తహశీల్దార్ వెంకటేష్‌తో అప్రమత్తమై గట్టు కొట్టుకుపోకుండా ముందుస్తుగా వెట్‌మిక్స్‌ర్‌తో పూడ్చివేశారు. వీచిన గాలులు, కురిసిన వర్షానికి వి.ఆర్.గూడెంలో రెండు, బుడిరి కంచారాంలో మూడు విద్యుత్ స్తంభాలు నేలకూలినట్లు విద్యుత్‌శాఖ ఎఇ సుధీర్ తెలిపారు. పొందూరు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో పైడికొండ నుంచి వచ్చే వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో లైదాం వద్ద రెల్లిగెడ్డపై గల వంతెన పైనుండి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో ఎస్ఐ వి.సత్యనారాయణ వరద ఉధృతిని పరిశీలించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని మంచినీళ్లపేట సముద్ర తీరాన్ని ఆర్‌డిఒ జి.వెంకటేష్ పరిశీలించారు. అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎనిమిది పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మట్టి ఇల్లు, ప్రమాదకరంగా ఉన్న ఇల్లల్లో ఉండరాదని పునరావాస కేంద్రాలను ఆశ్రయించాలని మత్స్యకారులకు సూచించారు. కార్యక్రమంలో తమశీల్దార్ డి.సీతారామయ్య ఉన్నారు. అలాగే ఎఇ బి.ధనుంజయరావు పూండి- నౌపడ హదారిలో అమలపాడు గ్రామాల్లో ముంపు పంటలను పరిశీలించారు.

కంచిలి : రోడ్డు ప్రవహిస్తున్న వర్షపునీరు

శ్రీకాకుళం నగరం జలమయం

అరసవల్లి : శ్రీకాకుళం నగరం జలమయమైంది. ఆర్‌టిసి కాంప్లెక్స్, రైతు బజార్‌లో నీరు చేరడంతో కొనుగోలుదారులు అవస్థలు పడ్డారు. బొందిలిపురం, ఇల్లీస్‌పురం, గోవింద్ నగర్ కాలనీ, డిసిసిబి కాలనీ, ఇందిరానగర్ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీల్లోని రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీంతో అవస్థలు, ఇబ్బందులు పడ్డారు. ఫారెస్టు కార్యాలయం ఎదుట, ముద్దాడ చినబాబు ఆస్పత్రి సమీపంలో రోడ్డుపై నీరు చేరింది.

మొలకెత్తిన మొక్కజొన్న

లావేరు : మండలంలోని లావేటిపాళెం, కేశవరాయపురం, తాళ్లవలస, బొడ్డపాడు, సుభద్రపురం, గోవిందపురం తదితర గ్రామాల్లో కల్లోల్లో, రోడ్లపైన ఎండ బెట్టిన మొక్క పంట వర్షానికి తడిసి మొలకలు వచ్చాయి. బుడుమూరు అదపాక గ్రామాల్లో పొట్ట దశ దాటి ఎన్ని ఈనని వరి పంటలు నేల మట్టమయ్యాయి. ఆరుగాలం పండించిన పంట ఇంటికి చేరే సమయంలో ఇలా తడిచిపోవడం రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కేశవరాయ పురం, లావేరు, లావేటిపాలెం, జి.జి.వలస, గుమ్మాడం గ్రామాల్లో బొప్పాయి చెట్లు విరిగి పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తహశీల్దార్ జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, డిప్యూటి ఎంపిడిఒ పద్మజలు పర్యటించారు.

రాకపోకలు నిషేధం

మొంథా తుపాను ప్రభావం కారణంగా మండలంలోని అదపాక-గుర్రాలపాళెం గ్రామాల మధ్యలో ఉండే గెడ్డ కాజ్‌వే పై నుంచి వర్షపునీరు ప్రవహిస్తుంది. దీంతో వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించజకుండా అధికారులు మంగళవారం రాత్రి 8 గంటలు సమయంలో రహదారికి అడ్డంగా తహశీల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షతన పోలీసులు, సచివాలయ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి నిషేధించారు.

మొలకెత్తిన మొక్కజొన్న

ఉద్యమంపై నిర్బంధం తగదు

మాట్లాడుతున్న నాయకులు

పలాస : బూర్జ-సరుబుజ్జిలి మండలాల్లో నిర్మించనున్న థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత కొన్ని నెలలుగా అక్కడ ఆదివాసీలు, మైదాన ప్రాంత ప్రజలు సోమవారం చేపట్టిన ధర్నాను ప్రభుత్వం అడ్డుకుని అరెస్టు చేశారని, పోలీసుల నిర్బంధలు తగదని ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయక భూములను ప్లాంట్ నిర్మాణానికి ఇవ్వమని అనేక రూపాల్లో ఉద్యమించినా ప్రభుత్వాలు బలవంతంగా డ్రోన్ల ద్వారా సర్వేలు చేయడం సరికాదని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలియజేసే హక్కు ప్రతి పౌరుడికీ ఉందన్నారు. వ్యవసాయక భూములను కార్పొరేట్లకు కారు చౌకగా అప్పచెప్పే చర్యలను వామపక్ష, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్, వైకుంఠరావు, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా అధ్యక్షులు శాలిన వీరాస్వామి, గంగయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అధ్యక్షులు తామడ సన్యాసిరావు, దుష్యంత రామారావు, కామేష్, కైలాస్, జగదీష్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పోతనపల్లి కుసుమ, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి వినోద్‌కుమార్, మహిళా సంఘం నాయకులు నాగమణి పాల్గొన్నారు.

గిరిజనుల అరెస్టు అన్యాయం

వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస : శాంతియుతంగా చేసుకుంటున్న ధర్నా చేస్తున్న గిరిజనులను అరెస్టులు చేయడం అన్యాయమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని వైసిపి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలోని వెన్నెలవలస ఆదివాసీ ప్రాంతంలో 3200 మెగా వాట్స్ సామర్థ్యం గల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ ను నిర్మిస్తామని జెన్కో అధికారులు, ఎమ్మెల్యే ప్రకటన చేశారని అన్నారు. ఈ ప్రకటన వెలువడిన తరువాత గడచిన 8 నెలలుగా ఆదివాసీలు రైతులు థర్మల్ విద్యుత్ కేంద్రం వద్దని వివిధ రూపాల్లో వారు ఆందోళన కొనసాగిస్తున్నారని అన్నారు. ఆదివాసీలు రైతాంగం థర్మల్ విద్యుత్ కేంద్రం వద్దని పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నా... పెడచెవిన పెట్టడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకు లు కొప్పుల ఈశ్వరరావు, చిగురుపల్లి గిరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

బారువ బీచ్ అభివృద్ధికి కృషి

వినతిపత్రం అందజేస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బారువ బీచ్‌లో ఓపెన్ స్టేడియం నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మంగళవారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన కేంద్రమంత్రి వెంటనే సిబిఆర్ నిధులు రూ.5 కోట్లతో స్టేడియం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే లైటింగ్, మినీ పార్కు ఏర్పాటుకు సైతం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. బారువ పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చెందేందుకు ఓపెన్ స్టేడియం నిర్మాణం ఎంతో దోహద పడుతుందని విప్ అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మడ్డు కుమార్ పాల్గొన్నారు.

నువ్వలరేవులో వైద్య శిబిరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రజలు విద్య సేవలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని టిడిపి యూనిట్ కన్వీనర్ కదంబాల వెంకటరమణ కోరారు. మండలంలోని నువ్వలరేవులో మొంథా తుపాను కారణంగా ముందు జాగ్రత్త చర్యగా వైద్య సిబ్బంది మంగళవారం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉష, ఎఎన్ఎంలు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పునరావాస కేంద్రాలకు తరలింపు

పలాస : పునరావాసం కల్పిస్తున్న కమిషనర్ రామారావు

కొత్తూరు : పునరావాస కేంద్రానికి తరలించిన అధికారులు

పలాస : మొంథా తుఫాన్ కారణంగా ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ లోతట్టు ప్రాంతాలు, శివారు గ్రామాలను ఇంజినీరింగ్, శానిటేషన్ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు పర్యటించారు. 6వ వార్డు పెసరుపాడుకి వెళ్లే రోడ్డులో నర్సిపురం కాలనీ ఆనుకొని నివసిస్తున్న సంచార జాతుల, వలస కూలీల గుడారాలు ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మునిగిపోయారు. వారిని తమ సిబ్బంది సహాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించి, వారికి భోజన సదుపాయాలు కల్పించారు. పెసరపాడు కు వెళ్లే రహదారిలో చెరువు ఉధృతంగా ప్రవహిస్తోంది. అడవి కొత్తూరు, కోసంగిపురం, పాయకరాంపురం, పారసాంబ, అంతరకుడ్డ సందర్శించారు

సరుబుజ్జిలి : మండలంలోని చిగురువలస పంచాయతీ శ్రీరామవలస ప్రాంతంలో ఉన్న వాల్మీకి నగర ఎరుకల కులస్తులకు తహశీల్దార్ ఎల్.మధుసూదన్ పునరాస కేంద్రం ఏర్పాటు చేశారు. చిగురువలస సరుబుజ్జిలి గ్రామాల మధ్య తాత్కాలిక పురిపాకల గృహాలను ఏర్పాటు చేసుకొని కొంతమంది ఎరుకల కులస్తులు ఇక్కడ జీవిస్తున్నారు. సమాచారం అందుకున్న తహశీల్దార్ వెళ్లి సరుబుజ్జిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పునరావాసం కల్పించారు.

సోంపేట తూపాను ప్రభావిత గిరిజన గ్రామాలకు చెందిన సుమారు 125 మందిని రెండు పునరావస కేంద్రాలకు మంగళవారం ఉదయం తరలించినట్లు తహశీల్దార్ అప్పలస్వామి తెలిపారు. మండలంలోని పైడిగాం, జెన్నా సాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు వారిని తరలించి వసతి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొత్తూరు : మండలంలోని మదనాపురం పంచాయతీ రామకృష్ణాపురం 40 నిర్వాసితుల ను పునరావాస కేంద్రాలకు నియోజకవర్గ నోడల్ అధికారి డి.సత్యనారాయణ స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలకు తరలించారు. వారికి భోజనం, తాగునీరు అందజేశారు. ఎంపిడిఒ బి.వి.ఆర్.ప్రసాదరావు, తహశీల్దార్ కె.బాలకృష్ణ, సిఐ చింతాడ ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ బి.సుందర్శనరావు, టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, సర్పంచ్ కొంచాడ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై అసంతృప్తి

కవిటి: మండలంలో విద్యుత్ సిబ్బంది పనితీరు, విద్యుత్ సరఫరాపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం సాయంత్రం 6.30 గంటల నుంచి కవిటి మండలంలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా మంగళవారం సాయంత్రం 4.15కు పునరుద్ధరించారు. తీవ్రమైన గాలుల ప్రభావం లేకపోయినా సుమారు 20 గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మండల వ్యాప్తంగా తాగటానికి, నిత్య అవసరాలకు నీరు కరువయ్యింది. మంగళవారం ఉదయం ఒక 15 నిమిషాల పాటు విద్యుత్ ఇచ్చిన సిబ్బంది సాయంత్రం 4.15కి మళ్లీ సరఫరా చేశారు. ఆ తరువాత కూడా పదేపదే నిలిపివేయడంతో ప్రజల సమస్యలు ఎక్కువయ్యాయి.

తాగునీరు సరఫరా

బూర్జ : మండలంలోని ఉప్పిన వలసలో మంగళవారం తాగునీరు సరఫరా చేశారు. గత కొద్దిరోజులుగా గ్రామంలో తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని సచివాలయం కార్యదర్శి జి.జితేంద్ర కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ గన్ని రాజు స్పందించి మోటారుకు మరమ్మతులు చేపట్టి తాగునీటిని సరఫరా చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ రాజు



పోలాకి : రామచంద్రరావు మృతదేహం



విద్యుదాఘాతంతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని బొంతలకోడూరు విఆర్ఎ బొంతల నర్సింహులు (45) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నర్సింహులు మొంథా తుపానుకు సంబంధించి సోమవారం రాత్రి విధులు నిర్వర్తించి మంగళవారం ఉదయం దుర్గాభవాని మాల వేశాడు. గ్రామంలోని భవాని సన్నిధి వద్ద విద్యుత్ వైరు ఇనుప గేటుకు తగిలి ఉండటం నర్సింహులు గమనించక దానిని తాకటంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి భవానీ భక్తులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీమెన్ మృతి

పోలాకి: మండలంలో గుళ్లవానిపేటకు చెందిన కారి రామచంద్రరావు (41) విద్యుదాఘాతంతో మృతి చెందారు. మృతుడు సీమేన్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన దీపావళికి స్వగ్రామానికి వచ్చారు. పండగ నిమిత్తం ఇంటికి సీరియల్ సెట్ అలంకరించారు. వాటిని మంగళవారం ఉదయం 10.30 గంటలు సమయంలో మేడ పైకి వెళ్లి తొలగిస్తున్నారు. పైన ఉన్న విద్యుత్ వైర్లను గమనించక వాటిని తాకగడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య మమత, కుమారుడు పార్థసారథి, కుమార్తె ఆద్య ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇంటికి పెద్ద దిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

విజయవాడలో జిల్లావాసి మృతి

సంతబొమ్మాళి : మండలంలోని నౌపడ పంచాయతీ సీతానగరానికి చెందిన బత్సల చిన్నారావు (38) మంగళవారం సాయంత్రం విజయవాడ రైల్వేస్టేషన్లో రైలు ప్రమాదంలో మృతి చెందారు. ఉపాధి కోసం చెన్నై వెళ్లిన చిన్నారావు స్నేహితులతో కలిసి గ్రామానికి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో విజయవాడ లోని రైలు మారాల్సి వచ్చింది. ఈ క్రమంలో చిన్నారావు రైలు ప్రమాదానికి గురైనట్లు స్నేహితులు చెబుతుండగా, కుటుంబ సభ్యులు అనుమానాస్పద మృతిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తి సమాచారం అందవలసి ఉంది.

విద్యుదాఘాతంతో ముగ్గురికి గాయాలు

బూర్జ: మండలంలోని పాలవలసలో మంగళవారం పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన పాలవలస నీలవేణి ఉదయం తన ఇంటి ముందు తడి బట్టలను ఆరబెడుతుండగా... విద్యుత్ షాక్‌కు గురైంది. ఇది గమనించిన ఆమె భర్త చంద్రునాయుడు ఆమెను రక్షించే ప్రయత్నంలో ఆమెను పట్టుకుని తానూ షాక్‌కు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన పాలవలస నారాయణమ్మ వారిని రక్షించేందుకు ప్రయత్నం చేసి షాక్‌కు గురైంది. అయితే ఒకరికి ఒకరు రక్షించుకునే ప్రయత్నంలో ముగ్గురూ విద్యాదాఘాతానికి గురయ్యారు. ఇది గమనించిన నారాయణమ్మ కుమారుడు నాగరాజు పరిస్థితిని చూసి వారిని రక్షించే ప్రయత్నంలో కర్రతో కొట్టడంతో వైర్లను విడిచిపెట్టారు. వెంటనే ముగ్గురిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ స్కానింగ్ అందుబాటులో లేకపోవడంతో శ్రీకాకుళం పట్టణంలోని రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఏదేమైనా పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పీల్చుకున్నారు.

వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం సిటీ: జాతీయ రహదారిపై మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మెట్ట భూపాలుడు గాయ పడ్డారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట పంచాయతీ లక్ష్ముడుపేటకు చెందిన ఈయన తన గ్రామానికి బైక్‌పై వస్తుండగా, పెద్దపాడు సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఆటో రావటంతో బైక్ ఆటోను ఢీ కొట్టింది. రోడ్డుపై పడిపోయిన వ్యక్తిని 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి శ్రీకాకుళం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం కోలు కుంటున్నారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ భూపాలుడు

11 కేజీల గంజాయి స్వాధీనం

పలాస : పలాస రైల్వేస్టేషన్‌లో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన మిక్కీ కుమార్ మాలిక్ అనే మహిళ 11 కేజీల గంజాయిని ముంబాయి తరలిస్తుండగా పట్టుపడిందని రైల్వే ఎస్ఐ కోటేశ్వరరావు, పలాస ఆర్‌పిఎఫ్ ఎస్ఐ మల్యాద్రి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రైల్వే స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఖను అనే వ్యక్తి రూ.పది వేలు ఒప్పందం కుదుర్చుకుని మిక్కీ కుమార్ మాలిక్ నాలుగు ప్యాకెట్లతో 11 కేజీల గంజాయిని బ్యాగ్‌లో పెట్టుకొని రైలు ఎక్కుతుందని అన్నారు. అనుమానంతో ఆమె బ్యాగ్ పరిశీలించగా గంజాయి దొరికిందన్నారు. ఆమెను అరెస్టు చేసి విశాఖపట్నం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న పోలీసులు

లారీ బోల్తా

మందస : మండలంలోని బాలిగాం హైవే వద్ద కోడి గుడ్డులు లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్ తుంబనాథం అప్రమత్తతతో ప్రాణాలను రక్షించుకున్నారు. సమాచారం అందుకున్న మందస ఎస్ఐ కృష్ణప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన లారీ

ఎజిపిగా వివేకానంద నియామకం

వివేకానంద

టెక్కలి : టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది దివ్వల వివేకానంద నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివేకానంద నియామకం ఇది రెండోసారి. మూడేళ్ల పాటు వీళ్ల పదవీ కాలంలో ఉంటారు. టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పలుమార్లు విధులు నిర్వర్తించిన వివేకానందకు ఎజిపిగా నియమించినందుకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు, పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్‌కు వివేకానంద కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

రూ.20 వేల ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు నాలుగు నెలల చిన్నారి వైద్య ఖర్చుల కోసం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. బొన్నాడకు చెందిన నాలుగు నెలల చిన్నారి బెక్షిత్ ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ గుండె జబ్బు కారణంగా హైదరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా దాతలు అందించిన ఆర్థిక సహాయాన్ని మంగళవారం చిన్నారి కుటుంబ సభ్యులకు పూండిలో సంస్థ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి గౌరవాధ్యక్షులు చింత మురళి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గొరకల సునీల్, చింత అపర్ణ, కర్ని సోమేష్, గొరకల విష్ణుప్, సైనీ తిరుపతి, కోడి నిహాల్, దున్న శంకర్, చింత పృథ్వీరాజు, పోలాకి వంశీ, గరికి ప్రసాద్ పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటాం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని ప్రాంత గ్రామం డొంకూరులో వేటలు తడిసిపోయిన నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం హామీనిచ్చారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో పర్యటించారు. తుపాను వల్ల దాదాపు రూ.20 లక్షల విలువ కలిగిన మత్స్య సంపద తడిసిపోవడాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కామేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు పెద్దిన బాబ్జి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నేతలు సహదేవ్‌రెడ్డి, దున్న లోకేష్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

మహిళా ఆరోగ్య భద్రతకు 'సఖి సురక్ష'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణ స్వయం సహాయ సంఘ మహిళల్లో ఆరోగ్య భద్రతకు సఖి సురక్ష పథకం ఉపయోగపడుతుందని, ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో మెప్మా ఆధ్వర్యాన నిర్వహించిన సఖి సురక్ష ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబం కోసం తన జీవితాన్నే త్యాగం చేస్తున్న మహిళల ఆరోగ్య భద్రత విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మెప్మా ప్రత్యేక శిబిరాలు చేపడుతోందన్నారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత నిస్తుందన్నారు. మహిళా ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 562 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, హెల్త్ ఆఫీసర్ పి.సుధాకర్, మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, అర్బన్ జిల్లా సమాఖ్య అధ్యక్షులు బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

తలసేమియా బాధితులను ఆదుకుందాం

ప్రజాశక్తి- అరసవల్లి

మాట్లాడుతున్న డాక్టర్ ప్రభు

తలసేమియాతో బాధపడుతున్న వారికి ఆదుకుంటామని భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (బిహెచ్‌ఆర్‌సి) నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రభు అన్నారు. బిహెచ్‌ఆర్‌సి, జ్యోత్స్న కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న వారికి నిత్యం రక్తమార్పిడి అవసరం అవుతుందని అన్నారు. బోన్‌మోరో ఇవ్వడం ద్వారానే మనిషి ప్రాణాలు రక్షించవచ్చునన్నారు. నూతన పద్ధతుల్లో బోన్‌మేరొను రక్తం ద్వారా సేకరించే అవకాశం ఉంటుందన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోనేందుకు స్వెబ్ టెస్టుల ద్వారా ఉపయోగపడే బోన్‌మేరొను తెలుసుకోవచ్చునన్నారు. మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.విక్టర్‌పాల్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మనిషి అనారోగ్యానికి గురవుతారనే అపవాదులను ఎవరూ నమ్మవద్దని సూచించారు. తమ కుటుంబ సభ్యులు ఏడాదికి రెండుసార్లు పిల్లల జన్మదిన వేడుకలు సందర్భంగా రక్తదానం చేస్తూనే ఉన్నామన్నారు. బిహెచ్‌ఆర్‌సి ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల అధ్యక్షులు కొంక్యాన వేణు గోపాల్ మాట్లాడుతూ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ బిహెచ్‌ఆర్‌సి ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు పోటీతత్వంతో రాణించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. బిహెచ్‌ఆర్‌సి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.మణిశర్మ మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో బిహెచ్‌ఆర్‌సి మహిళా విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సౌజన్య పట్నాయక్, కళాశాల సిబ్బంది యమున, ఆర్‌డిఎల్‌పి క్రిస్టియానా, రమ్య, ఉష, మధుప్రియ, కీర్తి, రాజేశ్వరి, లలిత, కుమారి, అమిత, భార్గవి, శివప్రభ, బేబిరాణి, ప్రమీల పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహా ప్రసాద్ పండా

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సమావేశం తుపాను కారణంగా సాదాసీదాగా సాగింది. ఆర్‌టిసి సేవలు అరకొరగా ఉన్నాయని, అవసరమైన సర్వీసును ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. రూ.30 కోట్లతో ఉపాధి హామీ పనులను గ్రామసభల ద్వారా ప్రతిపాదన చేశామని ఎపిఒటి రవి వెల్లడించారు. ములగసాగు లాభదాయకంగా ఉంటుందని, దీనిపై రైతులు శ్రద్ధ చూపాలని ఎఐపిఎం త్రినాథమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా మాట్లాడుతూ తుపాను తీవ్ర ప్రభావం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, డిప్యూటీ తహశీల్దార్ కె.రాము, ఎఒ ఎస్.దానకర్ణుడు, ఎంఇఒలు ఎన్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల పర్యటన

సోంపేట : మండలంలోని మా కన్నపురం, బారువ, పలాసపురం, బెంకిలి గ్రామాల్లో వరి పొలాలను తహశీల్దార్ అప్పలస్వామి, మండల ప్రత్యేక అధికారి భవానీశంకర్, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఎఒ అధికారి నరసింహమూర్తి పర్యటించారు.

బూర్జ : నాగావళిలో 18 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. దీంతో పరివాహక గ్రామాలైన బూర్జ, వావాదం, లాభం గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రెవెన్యూ, పోలీసులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

మెళియాపుట్టి : మండలంలోని రట్టిని, గోకర్లపురం గ్రామాల్లో వెన్ను దశలో ఉన్న పంటలు నేలకొరిగాయి. అధికారులు పర్యటించి పంట నష్టం అంచనా వేశారు.

నందిగాం : మండలంలోని నీట మునిటి పంట పొలాలను ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ పరిశీలించారు.

ఆమదాలవలస : మొంథా తుపాను నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని కలివరం, తొగారాం, చీమలవలస, కొర్లకోట గ్రామాల్లోని ముంపునకు గురైన పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటపొలాల్లో నీరు నిల్వ లేకుండా బయటకు వెళ్లేలా చేయాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు తెలిపారు. ధాన్యం రంగు మారకుండా, శిలీంద్ర వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి ఎకరానికి 200 మి.లీ ప్రొపికోనజోల్ పిచికారీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎఇఒ రాము, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎఒ మోహనరావు

కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నీటి నిల్వలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలో రోడ్లపైన్న, డ్రైనేజీల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులకు సూచించారు. మొంథా తుపాను నేపథ్యంలో మంగళవారం పట్టణంలో మున్సిపాల్ కమిషనర్ ప్రసాదరావుతో కలిసి పర్యటించారు. కాలువలు, రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో శ్రీకాకుళం కంట్రోల్ రూమ్ 08942-240557ను సంప్రదించాలని కోరారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో తుపాను వల్ల ఎటువంటి సమస్యలు తలెత్తలేదని తెలిపారు. జిల్లా అధికార యంత్రాగం అప్రమత్తంగా పనిచేస్తుందన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సిఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎంఆర్ఎఫ్ చెక్కులతో కష్టాలలో ఉన్న పేదలకు భరోసా కలుగుతున్నదని రాష్ట్ర పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే రవికుమార్ స్వగృహంలో పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎచ్చెర్ల మండలంలోని కొండములగం గ్రామానికి చెందిన జడ్డు కుమార్ నాయుడుకు రూ.2.60 లక్షలు, ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేటకు చెందిన పైడి కుమార్ సాయికు రూ.60 వేలు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు తాండ్ర హరి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న పీడీ శ్రీనివాసరావు

క్రీడాకారులకు అభినందనలు

టెక్కలి : పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో ఈ నెల 22 నుంచి 23 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అండర్-19 విభాగంలో టెక్కలికి జి.అభిరామ్ 400 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం, జి.అనూష 3000 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ పతకం, బి.మోక్ష 3000, 5000 మీటర్లలో రెండు సిల్వర్ పతకాలు సాధించారు. వీరికి శిక్షకులు, పెద్దతామరాపల్లి జెడ్‌పి హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ గజరావు శ్రీనివాసరావు అభినందించారు. నవంబరు నెలలో హర్యానా రాష్ట్రంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా అథ్లెటిక్స్ పోటీలో పాల్గొంటారని తెలిపారు.

అన్నదానం

అరసవల్లి : మన ఊరు.. మన బాధ్యతలో భాగంగా మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉండటంతో, ఆకలితో ఉన్నవారికి, నిరాశ్రయులకు ఆహారం అందించాలనే ఉద్దేశంతో కోరాడవారి వీధికి చెందిన చిరువ్యాపారి కోరాడ రమణ, కుమారి దంపతులు ముందుకొచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక గొంటి వీధిలో నిరాశ్రయులకు అన్నం అందించారు. ఉర్లాం శివతేజ, రవితేజ పాల్గొన్నారు.